## క్లుప్తంగా

### తుది దశలో శ్రీనివాస సేతు

**తిరుపతి తుడా:** శ్రీనివాస సేతు నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని స్మార్ట్ సిటీ ఎండీ హరిత తెలిపారు. ఆమె గురువారం శ్రీనివాస సేతుపై విద్యుత్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఆగస్టు ఐదు లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆగస్టులో శ్రీనివాస సేతును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ మోహన్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఎంఈ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఆప్కాన్స్ ప్రతినిధి రంగస్వామి పాల్గొన్నారు.

### పేదలకు అన్నదానం



**తిరుపతి కల్చరల్:** వైఎస్సార్ సీపీ నాయకుడు రాపూరి చిన్న జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం డీఆర్ మహల్ సర్కిల్‌లో పేదలకు అన్నదానం చేశారు. డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్కే.బాబు, కార్పొరేటర్ కోటూరి ఆంజనేయులు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు రాపూరి చిన్న కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నల్లాని బాబు, రాపూరి ప్రసాద్, మోహన్‌రాజ్, నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

### ఆగస్టు 9, 10 తేదీల్లో ఉచిత మెగా ఇంపాక్ట్ కార్యక్రమం

**తిరుపతి కల్చరల్/తిరుపతి అర్బన్:** పిల్లల్లో విద్యతో పాటు వికాసం, నైపుణ్యాలను పెంచి ఆత్మస్థైర్యాన్ని నింపాలనే ఉద్దేశంతో ఆగస్టు 9, 10 తేదీల్లో మహతి కళాక్షేత్రంలో ఉచిత మెగా ఇంపాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇంపాక్ట్ ఫౌండేషన్ ఈడీలు డాక్టర్ శ్రీధర్ విట్టలం, ఎస్.రత్నశేఖర్, తహసున్నీషా బేగం తెలిపారు. వారు గురువారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించా రు. వారు మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 7416666489, 7702431281, 9160091606లో సంప్రదించాలని కోరారు.

### బ్యాంకుల జాతీయీకరణతోనే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

**తిరుపతి అర్బన్:** బ్యాంకుల జాతీయీకరణతోనే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని తిరుపతి బ్యాంకు ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి జే.ధన్వంత్‌కుమార్, అధ్యక్షుడు విజయభాస్కర్ వెల్లడించారు. తిరుపతిలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ వద్ద గురువారం బ్యాంకుల జాతీయీకరణ 55వ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నేతలు జనార్దన్, నరసింహులు, భాస్కర్, సుమలత, రేష్మ, మహేష్, కేశవరెడ్డి, నందగోపాల్, నిర్మల, యజ్ఞేష్‌బాబు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

### ప్రత్యేక హోదా ఇవ్వాలని నిరసన

**తిరుపతి అర్బన్:** విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఏపీ ప్రత్యేక హోదా జేఏసీ కన్వీనర్ మర్రి రాజా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. 2019 ఎన్నికల సందర్భంగా బీజేపీ ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించాలని కోరారు. ఆయనకు సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ప్రజానాట్య మండలి నేత పెంచలయ్య, సీపీఐ నగర కార్యదర్శి భరత్, జాగృతి విద్యార్థి సంఘం నేత అశోక్‌కుమార్, ఆమ్ ఆద్మీ నేత ఈశ్వరయ్య మద్దతు తెలిపారు.

### టీడీపీ నేతకు మోహిత్ రెడ్డి నివాళి



**చంద్రగిరి(తిరుపతి రూరల్):** చంద్రగిరి మండలం తొండవాడ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత తపసి సత్యనారాయణరెడ్డి గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి రాత్రి ఆయన ఇంటికెళ్లి సత్యనారాయణ రెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

# వచ్చే ఎన్నికలు దుష్ట చతుష్టయం.. పేదల మధ్యే



17వ డివిజన్‌లో సీసీ రోడ్డు ప్రారంభం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు



36వ డివిజన్‌లో జగనన్న సురక్షలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, కార్పొరేటర్లు, నాయకులు

- 650 హామీలిచ్చి మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు
- సీఎం జగనన్నతోనే బిడ్డల భవిష్యత్తు
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

**తిరుపతి తుడా:** వచ్చే సార్వత్రిక ఎన్నికలు దుష్ట చతుష్టయానికి, పేదల మధ్యే వచ్చే ఎన్నికలు జరగనున్నాయని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి 2, 16, 36 డివిజన్లలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో అధికారం కోసం చంద్రబాబు 650కి పైగా హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. తర్వాత ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. జగనన్న ఎన్నికల హామీలను 98 శాతానికి పైగా అమలు చేశారని చెప్పా రు. కోవిడ్ కష్టకాలంలోనూ క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలను అందించిన ఘన చరిత్ర వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. బిడ్డల భవిష్యత్తును ఆలోచించే జగనన్నను తిరిగి గెలిపించుకోవాలని కోరారు. కార్పొరేటర్లు ఉమా, మోహన్‌కృష్ణ యాదవ్, కుడితి సుబ్రమణ్యం, కోఆప్షన్ సభ్యులు ఖాదర్‌బాషా, అదనపు కమిషనర్ సునీత పాల్గొన్నారు.

**మాది చేతల ప్రభుత్వం**

**తిరుపతి తుడా:** మాది మాటలు చెప్పి మోసం చేసే ప్రభుత్వం కాదు. చేతల ప్రభుత్వం అని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన గురువారం మేయర్ శిరీష, కమిషనర్ హరిత, ఉప మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణతో కలిసి తిరుపతి 17, 25 డివిజన్లలో రూ.32.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలు, తాగునీటి బోరును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేశామన్నారు. అది చేస్తాం.. ఇది చేస్తాం అని మాయ మాటలు చెప్పే సంస్కృతి తమ అధినాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, తమకు లేదన్నారు. మేయర్ శిరీష మాట్లాడుతూ నగరంలో పలుచోట్ల సీసీ రోడ్లు, డ్రైన్లు, యుడీసీలు, వాటర్ లైన్లు తదితర పనులు చేపట్టామన్నారు. 12వ డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.కె.బాబు, కార్పొరేటర్లు తాళ్లూరి రత్నకుమారి, కోటూరు ఆంజనేయులు, నరసింహాచారి, మునిరామిరెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



ఓటేరులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- 'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ మేలు
- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- 3,851 సర్టిఫికెట్ల పంపిణీ

**తిరుపతి రూరల్:** ప్రభుత్వ పథకాలతో పాటు ధ్రువీకరణ పత్రాలు కూడా ప్రజల ఇంటి వద్దకే అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. తిరుపతి రూరల్ మండలం విద్యానగర్, ఓటేరు, చంద్రగిరి మండలం శానంబట్ల, ఎ.రంగంపేట, పాకాల మండలం మద్దినాయనపల్లి సచివాలయాల్లో గురువా రం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మోహిత్‌రెడ్డి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నియోజకవర్గంలో ఒక్కరోజే 3,851 సర్టిఫికెట్లు అందజేసినట్టు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మార్గదర్శకంలో సీఎం జగనన్న ఆశయ సాధనకు, ప్రజల సేవకు అంకితమవుతానని, 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. తిరుపతి రూరల్ మండలం విద్యానగర్ సచివాలయంలో 607, ఓటేరులో 1,150, చంద్రగిరి మండలం శానంబట్లలో 627, ఎ.రంగంపేటలో 1,021, పాకాల మండలం మద్దినాయనపల్లిలో 446 సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

**రూ.1.66 కోట్లతో షాదీ మహల్ నిర్మాణానికి భూమి పూజ**

**చంద్రగిరి(తిరుపతి రూరల్):** తాము చెప్పింది తప్పక చేస్తామని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. రూ.1.66 కోట్లతో చంద్రగిరిలో షాదీమహల్ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. మోహిత్ రెడ్డి మాట్లాడుతూ 2014, 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలోని ముస్లింలకు బక్రీద్ పండుగ సందర్భంగా ఇచ్చిన మాటకు కట్టుబడి షాదీ మహల్ నిర్మాణానికి చర్యలు తీసుకున్న ట్టు చెప్పారు. చంద్రగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ మస్తాన్, ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, ప్రభుత్వ ఖాజీ ఇబ్రహీం మౌలానా, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ కరీము ల్లా వల్లీ, రెహ మానియా మసీదు ప్రెసిడెంట్ జర్ బాహర్ పాల్గొన్నారు.

## రూ.7.33 కోట్లతో రణధీర్‌పురం అభివృద్ధి



స్థానికులతో మాట్లాడుతున్న చెవిరెడ్డి లక్ష్మి

**తిరుపతి మంగళం :** మంగళంలోని రణధీర్‌పురం పంచాయతీని రూ.7.33 కోట్లతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అభివృద్ధి చేశారని చెవిరెడ్డి లక్ష్మి తెలిపారు. ఆమె గురువారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సర్పంచ్ లీలావతి ఆధ్వర్యంలో రణధీర్‌పురం పంచాయతీలోని బీటీఆర్ కాలనీలో గడప గడపకూ ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సమస్య తీర్చాలని పలువురు మహిళలు విన్నవించడంతో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారికి సూచించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన మేలును గుర్తుంచుకుని తన బిడ్డ మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, సప్తగిరినగర్, తిరుమలనగర్ పంచాయతీల అధ్యక్షులు అశోక్‌రెడ్డి, గుండ్రాజు శివశంకర్‌రాజు, ఉపసర్పంచ్ ఉమాపతి పాల్గొన్నారు.

## ఖాతాదారులకు మెరుగైన సేవలు



ర్యాలీ చేస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగులు

**తిరుపతి అర్బన్:** ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు బ్యాంక్ ఆఫ్ బరోడా రీజినల్ మేనేజర్ పి.అమరనాథ్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలో గురువారం బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి వీవీ మహల్ రోడ్డులోని మెయిన్ బ్రాంచ్ నుంచి అన్నారావు సర్కిల్ వరకు ఆరోగ్యం–పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ బ్యాంక్ వాకథాన్ నిర్వహించారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌తో కలిసి రక్తదాన శిబిరం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తమ బ్యాంక్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న అన్ని పథకాలూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇంటి నిర్మాణం, ఉన్నత చదువులు, విదేశాల్లో చదువులు, వ్యవసాయం, వ్యాపారం కోసం రుణాలు ఇస్తున్నామని చెప్పారు.

## ప్రజా ప్రయోజనం కోసమే జగనన్న సురక్ష



జగనన్న సురక్షలో పాల్గొన్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

**రామచంద్రాపురం:** ప్రజా ప్రయోజనం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నెత్తకుప్పంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో రూ.45,613 విలువైన 905 సర్వీసులను ప్రజలకు ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఇందులో 228 కులం, 232 ఆదాయ, 21 ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రాలు, 7 నూతన రేషన్ కార్డులు, 105 బియ్యం కార్డుల మార్పులు, చేర్పులు, 39 పట్టా మ్యుటేషన్, 28 జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఒక ఆరోగ్యశ్రీ, 244 ఆధార్ సేవలను అందించినట్లు వివరించారు. సంక్షేమ పథకాలు, రేషన్‌కార్డు, సర్టిఫికేట్ల సమస్యలు ఉంటే జగనన్న సురక్షలో పరిష్కరించుకోవచ్చన్నారు. ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, భానుకుమార్‌రెడ్డి, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ లావణ్య పాల్గొన్నారు.

## సమగ్రంగా ఓటర్ల సర్వే

**తిరుపతి మంగళం :** మంగళం పంచాయతీలో ఓటర్ల సర్వేను సమగ్రంగా చేపట్టి జాబితా తయారుచేయాలని తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ ఆదేశించారు. ఆయన గురువారం బీఎల్‌వోలతో సమావేశమయ్యారు. సప్తగిరినగర్, రణధీర్‌పురం, మంగళం, తిరుమలనగర్ పంచాయతీలలోని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పరిశీలించాలన్నారు. సమావేశంలో వీఆర్‌వోలు భూపతి, సుమన్ పాల్గొన్నారు.

## క్రీడాకారిణికి క్రికెట్ కిట్ వితరణ



క్రికెట్ కిట్ అందజేస్తున్న ఆర్డీవో కనక నరసారెడ్డి, మధుసూదనరావు, అంజి

**తిరుపతి కల్చరల్:** పేద కుటుంబానికి చెందిన క్రీడాకారిణి వైష్ణవికి చిల్లీస్ హోటల్ అండ్ రెస్టారెంట్స్ ఫౌండర్ మధుమోహన్‌రావు ఆధ్వర్యంలో గురువారం ఇంటర్నేషనల్ క్రికెట్ క్రీడా కిట్‌ను అందజేశారు. ఆమె అండర్ 15 రాష్ట్ర జట్టుకు, చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి విశేష ప్రతిభ చూపింది. ఆ విషయం తెలుసుకున్న చిల్లీస్ రెస్టారెంట్ సమావేశ మందిరంలో ఆర్డీవో కనకనరసారెడ్డి, మధుమోహన్‌రావు, చిల్లీస్ అధినేత అంజి చేతుల మీదుగా క్రికెట్ క్రీడా కిట్‌ను అందజేశారు. వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని, వైష్ణవి భారత జాతీయ జట్టు, ఉమెన్స్ ఐపీఎల్ జట్లకి ఆడాలని ఆకాంక్షించారు.

## చేపల సొసైటీలో భాగస్వాములను చేయండి



మత్స్యశాఖ డెప్యూటీ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వెంకటాపురం గ్రామస్తులు

**తిరుపతి కల్చరల్:** చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్న తమను చేపల సొసైటీలో భాగస్వాములను చేయాలని రేణిగుంట మండలం వెంకటాపురానికి చెందిన మత్స్యకారులు కోరారు. వారు గురువారం మత్స్యశాఖ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని చెరువు సొసైటీలో 37 మంది సభ్యులకు స్థానం కల్పించాల్సి ఉండగా 10 మందికి మాత్రమే అవకాశం ఇచ్చారని తెలిపారు. మిగిలిన 27 మందికి అన్ని అర్హతలు ఉన్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. స్పందించిన ఆయన పరిశీలించి అర్హత ఉంటే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వలసలు వెళ్లకుండా మీ ప్రాంతంలోనే చెరువు ఆధారంగా చేపల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## వర్సిటీలోని సమస్యలను పరిష్కరించాలని వినతి



వీసీని సత్కరిస్తున్న ఓబుల్‌రెడ్డి తదితరులు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** పద్మావతి మహిళా వర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి కోరారు. ఆయన గురువారం వీసీ డి.భారతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మణి, అశోక్ రెడ్డి, ప్రదీప్, ప్రశాంత్ , ప్రసన్న రెడ్డి, భార్గవ్, బాష, ఉమామహేశ్వర రెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



మొక్కలు అందజేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

**చంద్రగిరి(తిరుపతి రూరల్):** పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ రెండు కొబ్బరి మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం చంద్రగిరి, రంగంపేట గ్రామాల్లో కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజుకు ఒక మొక్కను నాటాలన్నారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, సర్పంచులు రూప, ఎర్రయ్య, ఎంపీటీసీలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాధవరెడ్డి, ఔరంగజేబు, బోస్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## చంద్రగిరి మండల వైఎస్సార్‌పీపీ పంచాయతీ అధ్యక్షుల నియామకం



రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్

**తిరుపతి రూరల్:** చంద్రగిరి మండలంలో పలు పంచాయతీలకు వైఎస్సార్ సీపీ అధ్యక్షులను నియమిస్తూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పనపాకంకు చెంగల్రాయులు, ముంగిళిపట్టుకు సుధాకర్, శానంబట్లకు చంద్రశేఖర్‌రెడ్డి, మిట్టపాళెంకు శ్రీనివాసులురెడ్డి, ఏరంగంపేటకు రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు.

### ఎస్‌డీహెచ్ఆర్ విద్యార్థులకు ఉద్యోగాలు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** తిరుపతిలోని ఎస్‌డీహెచ్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు 14 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎ.ఉష ఒక ప్రకటనలో తెలిపారు. ఆ కళాశాలలో గురువారం ప్రముఖ ఎంఎన్‌సీ సంస్థ అయిన (24) 7 ఏఐ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు తెలిపారు. ప్రతిభ చూపిన 14 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థులను ఆ కళాశాల చైర్మన్ డీవీఎస్.చక్రవర్తి అభినందించారు.

### వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలి

**రామచంద్రాపురం:** వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందస్వామి కోరారు. ఆయన గురువారం వీఆర్ఏలతో కలిసి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ వీఆర్ఏలకు రూ.26 వేల జీతం ఇవ్వాలని, ఇంటర్ విద్యార్హతతో పదోన్నతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ఏల మండల అధ్యక్షుడు వెంకటేష్, గంగయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### మెకానిక్‌కు రూ.10 వేలు సాయం

**తిరుపతి కల్చరల్:** అనారోగ్యంతో బాధపడుతున్న మెకానిక్ ఇంతియాజ్ బాషాకు తిరుపతి జిల్లా టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం రూ.10 వేలు సాయం అందించారు. అతను నెల రోజులుగా ఏలూరు సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అసోసియేషన్ అధ్యక్షుడు మునిరెడ్డి రూ.10 వేలు చెక్‌ను బాధితుడికి అందజేశారు.

### మెకానిక్కులకు ప్రమాద బీమా సౌకర్యం

**చంద్రగిరి(తిరుపతి రూరల్):** మూలస్థాన ఎల్లమ్మ చంద్రగిరి మెకానిక్స్ అసోసియేషన్‌లో ఉన్న ప్రతి సభ్యుడికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించనున్నట్లు అధ్యక్షుడు కుమార్ తెలిపారు. చంద్రగిరిలో గురువారం అసోసియేషన్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ప్రతి మెకానిక్‌కూ గుర్తింపుకార్డులు మంజూరు చేస్తామన్నారు. ఉపాధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శులు హరి, రాజశేఖర్, మార్కొండ, పళణి, కోశాధికారులు నాగరాజు, అన్వర్ బాషా పాల్గొన్నారు.

### రేపటి నుంచి శ్రీమద్ రామాయణ సప్తాహం

**తిరుపతి కల్చరల్:** తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల గ్రామంలో శనివారం నుంచి 28వ తేదీ వరకు రామకృష్ణ సేవా సమాజం ఆధ్వర్యంలో శ్రీమద్ రామాయణ సప్తాహ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ కార్యదర్శి కె.రామకృష్ణ, శతావధాని ఆముదాల మురళి తెలిపారు. వారు గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రామాయణాన్ని శతావధాని ఆముదాల మురళి ప్రతి రోజూ సాయంత్రం 6.45 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవచనం చేస్తారని పేర్కొన్నారు.

### శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

**తిరుమల:** శ్రీవారిని గురువారం ఉమ్మడి రాష్ట్రాల బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ విన్ ఓవెన్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు లడ్డూ, ప్రసాదాలతో సత్కరించారు.